## క్లుప్తంగా

### అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ..

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీలో కబ్జాకు గురైన షాదీఖానా భూమిని స్వాధీనం చేసుకుని ముస్లిం మత పెద్దలకు అప్పగించకుండా, కొందరు ప్రభుత్వ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని బెల్లంపల్లికి చెందిన ముస్లిం నాయకులు అన్వర్ ఖాన్, అమానుల్లాఖాన్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమార్కుల నుంచి షాదీఖానా భూమిని కాపాడి, నిందితులపై చర్యలు తీసుకుని అన్యాక్రాంతమైన భూమిని ముస్లిం మత పెద్దలకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మత నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులు ప్రారంభం

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు జ్యోతినగర్‌లో రూ.2లక్షల జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణపు పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### నంనూర్‌లో 15, 16 తేదీల్లో కబడ్డీ పోటీలు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం నంనూర్–గుడిపేట పునరావాస కాలనీలో 15, 16తేదీల్లో రెండు రోజుల పాటు కబడ్డీ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ మల్లికార్జున యాదవ్ సంఘం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు బహుమతిగా ఇవ్వబడునని నిర్వాహకులు గెల్లు మధూకర్, జిల్లా చంద్రశేఖర్ తెలిపారు.

### ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

**తాండూర్:** కార్మిక కుటుంబాలు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తాండూర్ గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీటీసీ సిరంగి శంకర్ అన్నారు. తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం కార్మిక శాఖ సౌజన్యంతో సీఎస్సీ ఆరోగ్య సంరక్షణ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో దాదాపు 40రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. ప్రతికూల పరిస్థితుల్లో పనిచేసే కార్మికులు, వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తపాస్, స్థానిక నాయకులు ఈసా, సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ టీచర్‌కు ప్రభుత్వ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న టీచర్ పద్మ

**మంచిర్యాల టౌన్:** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ఎన్.పద్మకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ పురస్కారంను ప్రదానం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీల ఆధ్వర్యంలో వుమెన్ అచీవ ర్స్ 2024అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు అభినందించారు.

### వీడ్కోలు హంగామా



**జైపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీస్‌మా దుర్యా, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శంకర్‌రావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులు డ్యాన్సులతో అలరించారు.

# పౌష్టికాహారంపై అవగాహన

- కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు
- గర్భిణులు, తల్లులు పోషకాహారం తీసుకోవాలని సూచన



తాండూర్: అన్నప్రాసన చేయిస్తున్న సూపర్‌వైజర్

**భీమిని:** పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఎర్లీ చైల్డ్‌కేర్, ప్రీ స్కూల్ కార్నర్ గురించి విద్యార్థుల తల్లులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిరా, అంగన్‌వాడీ టీచర్లు వేరోణిక, సునీత, వెంకటలక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్:** చిన్నారులకు, గర్భిణులకు మంచి పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వరూపరాణి, మమత సూచించారు. మండలంలోని అచలాపూర్, బోయపల్లి గ్రామాల్లో గురువారం పోషణపక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అచలాపూర్‌లో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన చేపట్టారు. చిరుధాన్యాలలో ఐరన్, ఫైబర్, ప్రోటీన్స్, జింక్ ఎక్కువగా ఉండి ఎక్కువ శక్తిని ఇస్తాయని, అటువంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పూలావతి, భాగ్య, రాధా, కౌసల్య, సునీత, మల్లుబాయ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని పెద్దంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే లాభాలను తెలిపారు. చేతుల శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** పట్టణంలోని నేతాజీనగర్–2 అంగన్‌వాడీ సెంటర్లో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సెక్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య హాజరై చిన్నారుల తల్లులు, గర్భిణులు ఆరోగ్యవంతమైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం వాడల్లో ర్యాలీ తీసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అపర్ణ, స్వరూప, వసంత, చైల్డ్ హెల్ప్‌లైన్ టీం సభ్యులు మౌనిక, లిప్సిక తదితరులు ఉన్నారు.

## బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

**బెల్లంపల్లి:** తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న ఉదయం 11గంటలకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

## భయం వీడి పరీక్షలు రాయండి

- డీఈవో యాదయ్య



బహుమతులు అందజేస్తున్న డీఈవో యాదయ్య

**మంచిర్యాలఅర్బన్:** పదో తరగతి పరీక్షలు భయపడకుండా ప్రశాంతంగా రాయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల కార్మెల్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి పదోతరగతి టాలెంట్ టెస్ట్–2024 పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మోడల్‌స్కూల్‌రాజీవ్ నగర్ సాయివర్షిత, రెండో బహుమతి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని కెవిన్, మూడో బహుమతి కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన హసిత సాధించారు. పట్టణ కమిటీ మొదటి స్థానం నారాయణ హైస్కూల్‌కు చెందిన సాయి రుచిత, రెండో బహుమతి శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన పవన్, మూడో బహుమతి క్రిష్ణవేణి హైస్కూల్‌కు చెందిన సహస్రలు, కేజీబీవీకి చెందిన వైష్ణవి స్కూల్ టాపర్‌గా నిలిచింది. స్ప్రింగ్ ఫీల్డ్ హైస్కూల్‌కు చెందిన రుత్విక్‌లు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఎంఈవో పోచయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, కమిటీ సభ్యులు అభినవ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీరోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో

**కోటపల్లి:** గ్రామపంచాయతీల్లో ప్రతీరోజు తప్పక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని ఎసన్‌వాయి, సర్వాయిపేట, సిర్సా గ్రామపంచాయతీలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా చేయించాలని, ప్లాస్టిక్ చెత్త కనబడకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ట్రాక్టర్‌తో ఇంటింటా చెత్త సేకరణ చేసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. కంపోస్టు తయారీ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనం మొక్కలకు వినియోగించాలన్నారు. నర్సరీలను పరిశీలించి వేసవి కాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఉదయం సాయంత్రం నీటిని అందించాలన్నారు. వందశాతం ఇంటి పన్నులు వసూల్ చేయాలని, వేసవికాలం ఉన్నందునా గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూడాలని పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో అక్తర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### తీరిన తాగునీటి కష్టాలు

**నెన్నెల:** మండలంలోని మైలారం మత్తడివాగులో వేసిన బోరుబావి గత 30ఏళ్లుగా మైలారం గ్రామస్తులకు మంచినీటిని అందించింది. రెండేళ్ల నుంచి ఆ బోరు ఇసుకలో కూరుకుపోయింది. ఎండలు మండుతుండటంతో మైలారంలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఈ విషయాన్ని గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ అసెంబ్లీ ఎన్నికల ముందు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దష్టికి తీసుకెళ్లగా అధికారంలోకి రాగానే మంచినీటి సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం హరీష్‌గౌడ్ ప్రొక్లెనర్ సాయంతో పూడిక తొలగించి బోరు బావికి మరమ్మతు చేయించి తాగునీటిని గ్రామస్తులకు అందేలా చేశారు. దీంతో ఎమ్మెల్యే వినోద్, ఎంపీటీసీ హరీష్‌గౌడ్‌కు మైలారం ప్రజలు కతజ్ఞతలు తెలిపారు.

### 'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'

**పాతమంచిర్యాల:** బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ఇంటర్వ్యూలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్క ప్రశాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. విశారదన్ మహారాజ్‌ను తక్కువ చేసి మాట్లాడిన మాటలను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వెనక్కి తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే బహుజనులందరూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకులు జంగంపల్లి స్వామి, నందిపాటి రాజు, తాళ్లపల్లి చంద్రశేఖర్, దుర్గం హేమచంద్ర, తాళ్లపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

### పన్నులు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

**మంచిర్యాల టౌన్:** మున్సిపాలిటీలోని ఇంటి యజమానులు ఇంటి ట్యాక్స్, మున్సిపల్ దుకాణాలను లీజుకు తీసుకున్న వారు అద్దె బకాయిలు, నీటి పన్నుల బకాయిదారులు సకాలంలో పన్నులను, అద్దెను చెల్లించాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మొత్తం 26,834 ఇళ్లు ఉండగా, పన్ను డిమాండ్ రూ.18.03కోట్లు కాగా, రూ.9.40 కోట్లు వసూలైందని, ఇంకా రూ.8.62కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. నీటి కనెక్షన్లు 13,200 ఉండగా, నీటి పన్ను రూ.3.53 కోట్లకు గాను, రూ.1.69కోట్లు వసూలైందని, ఇంకా రూ.1.49కోట్లు రావాల్సి ఉందన్నారు. ట్రేడ్ లైసెన్సులు రూ.2400 ఉండగా, రూ.72.94లక్షలకు గాను రూ.23లక్షలు వసూలు కాగా ఇంకా రూ.48.38లక్షలు వసూలు చేయాల్సి ఉందని తెలిపారు. మున్సిపల్ దుకాణాలు 57ఉండగా రూ. 2.39కోట్ల బకాయిలకు గాను రూ.28.40 లక్షలు మాత్రమే వసూలైందని, ఇంకా రూ.2.10కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. అద్దె కోసం దుకాణాలను లీజుకు తీసుకుని అద్దెను ఎగవేస్తున్న వారితో పాటు, ఇతరులకు అద్దెకు ఇచ్చిన వారిపై మున్సిపల్ చట్టప్రకారం చర్యలను తీసుకుంటామని, మూడు రోజుల్లోపు దుకాణాల అద్దె పూర్తిగా చెల్లించకపోయినా చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### మంచిర్యాల సీఐగా బన్సీలాల్



బన్సీలాల్



మోహన్

**మంచిర్యాలక్రైం:** మంచిర్యాల సీఐగా టీ.బన్సీలాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2017బ్యాచ్‌కు చెందిన బన్సిలాల్ శ్రీరాంపూర్ నుంచి ఇటీవలే బదిలీపై వచ్చారు. మంచిర్యాల సీఐగా ఈ నెల 2న బాధ్యతలు స్వీకరించి, ఆరోగ్యరీత్యా దీర్ఘకాలం సెలవులపై వెళ్లిన ర వీందర్ సీసీఎస్ కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు.

**శ్రీరాంపూర్ సీఐగా మోహన్**

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ స్టేషన్ సీఐగా బీ.మోహన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న బన్సిలాల్‌ను మంచిర్యాలకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖానాపూర్ సీఐగా పనిచేస్తున్న మోహన్‌ను శ్రీరాంపూర్‌కు బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం మోహన్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## రాజకీయంగా నా పేరు వాడుకోవద్దు

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**మందమర్రిరూరల్:** మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ ఏరియాలో గురువారం పలు అభివృద్ధి పనులకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకా వెంకటస్వామి ఎంపీగా ఉన్న సమయంలో గోదావరి నది ముల్కల్ల నుంచి రూ.24కోట్ల నిధులతో మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల ప్రజలకు తాగునీటి పైపులైన్ వేయించి శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల్లో ప్రభుత్వం ద్వారా ఇప్పటికే ఐదు హామీలు నెరవేర్చామన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతికి తావులేదని, తన పేరు చెప్పుకుని అధికారుల వద్ద రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ సుమతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మాంతమ్మ విగ్రహ ప్రతిష్ఠ**

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని అక్కెపల్లి గ్రామంలో గురువారం మాంతమ్మ ఆలయంలో మాంతమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొన్నారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మె ల్యే కుమారుడు గడ్డం వంశీకృష్ణ, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీఎస్‌వో ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



అక్షయను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జోబిన్

**మంచిర్యాలఅర్బన్:** ఐఎన్‌టీఎస్‌వో ఒలంపియాడ్ ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. లక్ష్మీనగర్ శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచికి చెందిన 95మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మూడో తరగతికి చెందిన సెగ్గం రుత్విక బంగారు పతకంతో రెండోర్యాంకు సాధించింది. ఏడో తరగతికి చెందిన అశ్విత, నాల్గో తరగతికి చెందిన అవినాష్ 4, 5వ ర్యాంకులు సాధించారు. ముగ్గురు ప్రత్యేక బహుమతులు, 31మంది విద్యార్థులు కన్సోలేషన్, బహుమతులు సాధించారు.

**శ్రీ చైతన్య పాఠశాలలో..**

స్థానిక కాలేజ్‌రోడ్ శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌వో ఒలంపియాడ్–11వ ఐదు బహుమతులు సాధించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి అక్షయగ్రాండ్ ఫైనల్‌గా నిలిచి లాప్‌ట్యాబ్, గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఆరో తరగతి విద్యార్థి గ్రాతమ్ రెడ్డి ప్రథమ, విఖ్యాత్‌రాణా తృతీయ బహుమతి సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీలు రాజేందర్ పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను చెల్లిస్తేనే పంచాయతీ సేవలు



రశీదు అందజేస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్

**తాండూర్:** గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆస్తి పన్ను, ఇంటి పన్ను సకాలంలో చెల్లిస్తేనే గ్రామ పంచాయతీ సేవలు అందించబడతాయని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. ఆస్తి పన్ను వసూలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం శ్రీనివాస్ గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేశారు. మార్చి 15వ తేదీ లోగా 100శాతం పన్ను వసూలు చేసేలా ప్రభుత్వం కట్ ఆఫ్ డేట్ విధించిందని, గడువులోగా ప్రతి ఒక్కరూ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తపాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది వంశీ, మధు తదితరులున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



బెల్లంపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



దండేపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీలు

**బెల్లంపల్లి:** పెర్క సామాజిక వర్గం కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ గురువారం బెల్లంపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మండల పెర్క సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన నాయకులు తదుపరి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంతోషం వ్యక్తం పరిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెర్క కులస్తులను గుర్తించి, తగిన గౌరవం కల్పించడం ముదావహమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మాజీ ఎంపీపీ తొంగల మల్లేశ్, పెర్క సంఘం నాయకులు తొంగల రాజేశం, శంకర్, బొప్పు అర్జయ్య, నారాయణ, సతీష్, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

**పద్మశాలీల సంబురాలు**

**దండేపల్లి:** పద్మశాలీలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై దండేపల్లిలో పద్మశాలీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పద్మశాలీ భవన్ వద్ద సీఎం చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. పద్మశాలీలను గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు. సంఘ నాయకులు దేవయ్య, లక్ష్మణ్, శంకర్, శంకరయ్య, రాజ్‌కుమార్, రామస్వామి, సత్యం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గణిత దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

**లక్సెట్టిపేట:** అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ.. జీవితంలో మనిషి యొక్క అవసరాలలో గణితం చాలా అవసరం అన్నారు. మ్యాథమెటిక్స్, పజిల్స్, విజిల్ సులభంగా అర్థమయ్యేందుకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అలరించిన ఫేర్‌వెల్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**భీమిని:** కన్నెపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కన్నెపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామాంజనేయ, భట్టు శ్రీనివాస్, సాయికృష్ణ పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు, స్కేళ్లు అందజేశారు.

## 'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



భీమారం: పరీక్ష సామగ్రి అందిస్తున్న హెచ్‌ఎం విక్రమ్

**భీమారం:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువి పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న 77మంది విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం విక్రమ్ తన సొంత ఖర్చులతో పరీక్షా ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, షారిక్‌అహ్మద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 48మంది విద్యార్థులకు యువ తెలంగాణ యూత్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షా సామగ్రి అందజేశారు. పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, స్కేల్ తదితర పరీక్షా సామగ్రిని యువ తెలంగాణ యూత్ అధ్యక్షుడు దుర్గరాజు ఆధ్వర్యంలో హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు పద్మజ, నాగమణి, రాజశేఖర్, మంజుల పాల్గొన్నారు.

**దండేపల్లి:** మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామంలోని పీఎస్ఆర్ టీం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల రాజేందర్, గడ్డం రాంచందర్, టీం సభ్యులు మహేందర్, శరత్, తిరుపతి, కిశోర్, రాజు, శేఖర్, రాజేందర్, హరీష్, సూర్య, విష్ణు పాల్గొన్నారు.

**భీమిని:** కన్నెపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామాంజనేయ, భట్టు శ్రీనివాస్, సాయికృష్ణ ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు, స్కేళ్లు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.